క్లుప్తంగా

నేడు గ్రామ వలంటీర్లతో మంత్రి రాజా సమావేశం

తొండంగి: మండల పరిధిలోని గ్రామ వలంటీర్లతో శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీఓ పసుపులేటి సతీష్ శుక్రవారం తెలిపారు. మండలంలోని 26 గ్రామసచివాలయాల పరిధిలో దాదాపుగా 528 మంది గ్రామ వలంటీర్లు ఉన్నారు. వీరితో రెండు విడుతలుగా సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం పది గంటలకు ఎ.కొత్తపల్లి, బెండపూడి, గోపాలపట్నం, కృష్ణాపురం, పి.ఈ.చిన్నాయపాలెం, రావికంపాడు, సీతారాంపురం, శృంగవృక్షం, పి.అగ్రహారం, తొండంగి గ్రామాల వలంటీర్లతోనూ, మధ్యాహ్నం మూడు గంటలకు ఏవీ నగరం, దానవాయిపేట, జి.ముసలయ్యపేట, కోదాడ, పెరుమాళ్లపురం, పైడికొండ, వేమవరం, యర్రయ్యపేట గ్రామాలకు చెందిన వలంటీర్లతో మంత్రి సమీక్షిస్తారని తెలిపారు.

శివాలయం అభివృద్ధికి చర్యలు



శంఖవరంలో కల్యాణ మండపం పనులను పరిశీలిస్తున్న ఈఈ సత్యనారాయణమూర్తి

శంఖవరం: అన్నవరం సత్యనారాయణస్వామి దత్తత ఆలయంగా ప్రసిద్ధిగాంచిన స్థానిక శివాలయం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్టు రత్నగిరి ఈఈ సత్యనారాయణ మూర్తి తెలిపారు. గ్రామంలోని శివాలయం అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. శివాలయం, సత్యదేవ కల్యాణ మండపం అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సహకారంతో రూ.56.75 లక్షలు నిధులు మంజూరైనట్టు తెలిపారు. ఆయన వెంట ఏసీ రమేష్‌బాబు, డీఈ ఉదయ్‌కుమార్, ఏఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మళ్లదొడ్డిలో ఇంటింటికీ కాంగ్రెస్ పాదయాత్ర

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ కాంగ్రెస్ పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజారోగ్యం కోసం గ్రామంలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ నిలుపుదలకు ఉద్యమిస్తామని తెలిపారు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఎస్ఈబీ సీఐగా అశోక్



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐగా పి.అశోక్ నియమితులయ్యారు. విజయవాడ బేవరీస్ డిపోలో విధులు నిర్వర్తిస్తున్న అశోక్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకూ ఇన్‌చార్జి సీఐగా వ్యవహరించిన విజయ్‌కుమార్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. కాగా ఎస్ఈబీ సీఐ అశోక్ గతంలో ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్సైగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్తిపాడు ఎస్ఈబీ సర్కిల్‌లో ప్రధానంగా సారా తయారీపై దృష్టి సారించి, సారా నిర్మూలనకు కృషి చేస్తానని చెప్పారు.

తంటికొండ దేవస్థానానికి బియ్యం, కూరగాయల వితరణ



దేవస్థానానికి బియ్యం అందిస్తున్న హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యులు

గోకవరం: మండలంలోని తంటికొండలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి సనాతన హిందూ ధర్మ ప్రచార రథయాత్ర ఆధ్వర్యంలో బియ్యం, కూరగాయలను అందించారు. ప్రచార సేవా సమితి ప్రెసిడెంట్ కరుటూరి శ్రీనివాస్‌రావు, సెక్రటరీ వాకపల్లి సూరిబాబు భక్తుల సహకారంతో ప్రతీ శనివారం నిర్వహించే అన్నదానానికి టన్ను బియ్యం, 150 కేజీల కూరగాయలను ప్రచార రథంపై ఆలయానికి తీసుకువచ్చి అందజేశారు.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



నినాదాలు చేస్తున్న సాధన సమితి నాయకులు

తుని: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని కరెన్సీ అంబేడ్కర్ సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జె.పరుశరామ్ డిమాండ్ చేశారు. కరెన్సీ అంబేడ్కర్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన గల్లీ టు ఢిల్లీ జీపు జాతా శుక్రవారం సాయంత్రం తునికి చేరుకుంది. గొల్ల అప్పారావు సెంటర్లో స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఫొటోను భారత కరెన్సీపై ముద్రించాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గోకవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



గోకవరంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వం తరపున తమకు అందుతున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే పింఛన్లు ప్రతి నెలా సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే వలంటీర్ల ద్వారా సచివాలయంలో సంప్రదించాలన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వెంటనే వారికి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని, అధికారులను ఆదేశించారు. స్థానిక అంబేడ్కర్ వీధిలో రూ.4.80 లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన మంచినీటి ట్యాంకును సర్పంచ్ కొమరం శ్రావణితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. వెలమపేటలో రూ.2 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో 2.60 లక్షల సామర్థ్యం గల రెండు మంచినీటి ట్యాంకులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వాస్పత్రిలో భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే చంటిబాబును ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సొసైటీ మాజీ చైర్మన్ దాసరి తమ్మన్నదొర, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తుమ్మల చిన్నబ్బు, నరాలశెట్టి నర్సయ్య, మంగరౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కళా తపస్వి విశ్వనాథ్ స్మృతిలో...



తుని శ్రీప్రకాష్‌లో కళాతపస్వీ విశ్వనాథ్‌ను స్వర్ణ పుష్పాలతో సత్కరిస్తున్న దృశ్యం (ఫైల్)


తుని: కళా తపస్వి కె.విశ్వనాథ్‌కు తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాలతో ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో ఆయన అన్నవరంలో సూత్రదారులు, తుని శ్రీప్రకాష్‌లో శుభప్రదం సినిమా షూటింగ్‌లు చేశారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు సీహెచ్‌వీకే నరసింహారావు 2007లో జరిగిన జోష్ వేడుకలకు విశ్వనాథ్‌ను ఆహ్వానించారు. విశ్వనాథ్‌ను స్వర్ణ పుష్పాలతో సత్కరించారు. విశ్వనాథ్ దంపతులు నరసింహారావు కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడిపారు. తెలుగు కీర్తి చరిత్రలను వెండి తెరకు అందించిన కళా తపస్వీ మన మధ్యలేరన్న విషయాన్ని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

చిత్రాన్ని గీసి.. అభిమానం చాటుకుని..



భమిడపాటి శేషగిరి

గండేపల్లి: సినీ నటుడు, దర్శకుడు కళా తపస్వీ కె.విశ్వనాథ్‌పై అభిమానంతో కాకినాడకు చెందిన భమిడపాటి శేషగిరి ఆయన చిత్రాన్ని గీసి అభిమానం చాటుకున్నారు. శేషగిరి గతంలో సూరంపాలెం ఆదిత్య కళాశాలలో ప్రాజెక్ట్ డైరక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం చిత్రలేఖనంలో రాణిస్తున్నారు. ఈ చిత్రాన్ని గీయడానికి సుమారు రెండు గంటల సమయం పట్టిందని ఆయన తెలిపారు.



శేషగిరి గీసిన విశ్వనాథ్ చిత్రం

శరవేగంగా ధాన్యం సేకరణ



దగ్గరుండి ధాన్యాన్ని లోడు చేయిస్తున్న ఏఏబీ డైరెక్టర్ లంక ప్రసాద్, ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: మెట్టలో రైతుల నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ శరవేగంగా జరుగుతోంది. నియోజకవర్గంలో రైసుమిల్లుల టార్గెట్ పూర్తి కావడంతో గత నాలుగు రోజులుగా ధాన్యం సేకరణ నిలిచిపోయింది. కాకరాపల్లిలో వేబ్రిడ్జి ప్రాంతంలో భారీగా ట్రాక్టర్లు నిలిచి పోయాయి. సమస్యను తెలుసుకున్న అధికారులు పౌరసరఫరాల శాఖ ద్వారా నేరుగా ధాన్యం సేకరించేందుకు చర్యలు తీసుకున్నారు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్ ఆధ్వర్యంలో ఏఓ కె.చంద్రశేఖర్, పౌరసరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్లు, స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది ధాన్యం నాణ్యతను పరిశీలించి పిఠాపురం, గొల్లప్రోలు, ప్రత్తిపాడు తదితర ప్రాంతాల్లోని రైసుమిల్లులకు తరలించారు. శుక్రవారం ఒక్కరోజే 80 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించినట్లు ఏఓ చంద్రశేఖర్ తెలిపారు. శని, ఆదివారాల్లో కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందని, రైతుల నుంచి 100 శాతం ధాన్యాన్ని సేకరిస్తామన్నారు. ఏఈఓ శివకుమారి, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమన్వయంతో పని చేయాలి



గృహసారథుల శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



శిక్షణకు హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- శంఖవరంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ తరగతులు

శంఖవరం: క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సూచించారు. మండల కేంద్రమైన శంఖవరంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు కుడుపూడి భరత్‌తో కలిసి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన మూడున్నర ఏళ్లలోనే 95 శాతం ఎన్నికల హామీలను నేరవేర్చారన్నారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. అర్హతే ప్రమాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా కుడుపూడి భరత్ మాట్లాడుతూ దేశం గర్వించే స్థాయిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉందన్నారు. ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. విపక్షాలు ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు సీఎం జగన్ వెంటే ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, జెడ్పీటీసీ తరుం రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి



లింగంపర్తిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ జ్యోతి

ఏలేశ్వరం: రబీలో వరిసాగు చేసిన రైతులు తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి సూచించారు. లింగంపర్తి రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం అగ్రీ అడ్వైజరీ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ జ్యోతి మాట్లాడుతూ ప్రస్తుతం వరిపంటలో కాండం తొలుచు పురుగు ఉధృతంగా ఉందన్నారు. రైతులు వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా తెగుళ్లు నివారించవచ్చన్నారు. సార్వా, దాళ్వా పంటల మధ్య కాలవ్యవధి తక్కువగా ఉండడంతో పాత సీజన్‌లో వరిమొదళ్లు సరిగా కుళ్లకపోవడంతో కాండం తొలుచు పురుగు ప్రభావం ఉందన్నారు. దీని నివారణకు ఎసిపేట్ 1.5 గ్రాములు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చిక్కాల లక్ష్మణరావు, వడ్డి నాగదుర్గ, ఆర్బీకే సిబ్బంది సత్యదుర్గ, జలజ పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలన

గోకవరం: మాజీ సీఎం, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటిస్తారని మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. గోకవరంలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ ఈ నెల 14న చంద్రబాబు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన గోకవరం చేరుకుని స్థానిక ఆంజనేయస్వామి గుడి సెంటర్‌లో రోడ్డు షో నిర్వహిస్తారన్నారు. అక్కడి నుంచి జగ్గంపేటకు చేరుకుని ఎన్టీఆర్ కాంస్య విగ్రహం, స్మారక మందిరం ప్రారంభిస్తారన్నారు. రాత్రికి జగ్గంపేటలో బస చేసి 15న పెద్దాపురం నియోజకవర్గం, 16న అనపర్తి నియోజకవర్గంలో పర్యటిస్తారని వివరించారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు రమేష్ ఘనపాఠి, ముష్టి పురుషోత్తం, అర్చకులు చిట్టెం వాసు, నగేష్, వ్రతపురోహితులు చల్లపల్లి ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. 24 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కొండ దిగువన తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి పండితులు లక్ష కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

ఏలేశ్వరం: స్థానిక భాష్యం స్కూల్‌లో ఇంట్రా స్పోర్ట్స్ మీట్ శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. జిల్లాలోని తుని, సామర్లకోట, పిఠాపురం, జగ్గంపేట, ఏలేశ్వరం బ్రాంచీలకు చెందిన విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ గొల్లపల్లి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో తొలిరోజు విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, షటిల్, వాలీబాల్, క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. తొలుత నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ జోనల్ ఇన్‌చార్జ్ వల్లూరి గోవిందరాజు, కౌన్సిలర్లు దోశ కిషోర్, కోనాల వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులు అప్రమత్తంగా ఉండాలి

తొండంగి: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం సముద్ర తీరాల్లో స్నానాలాచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎస్.రవికుమార్ సూచించారు. మండలంలోని అద్దరిపేట, కొత్తపేట, యర్రయ్యపేట, పంపాదిపేట, ఎల్లయ్యపేట, జి.ముసలయ్యపేట, వాడముసలయ్యపేట, దానవాయిపేట, తాటియాకులపాలెం, వాకదారిపేట, పెరుమాళ్లపురం, కొత్తచోడిపల్లిపేట సముద్రతీరాల్లో భక్తులు అధిక సంఖ్యలో సముద్ర స్నానాలు ఆచరించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో తీరప్రాంతంలో ఎటువంటి ప్రమాదాలకు తావివ్వకుండా గజ ఈతగాళ్లను, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. భక్తులు సముద్రస్నానాలు ఆచరించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎటువంటి ప్రమాదం సంభవించినా వెంటనే 94409 04847కు నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యార్థులకు టెక్నాలజీపై అవగాహన అవసరం

గండేపల్లి: విద్యార్థులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎన్.శేషారెడ్డి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య కళాశాలలో టెక్నికల్ హబ్ ప్రారంభించి ఏడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా టెక్నికల్ హబ్ టీమ్ సభ్యులు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు టెక్నికల్ హబ్ టీమ్ ఎంతో కృషి చేస్తోందన్నారు. వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ 2016లో ఒక్క శాతం విద్యార్థులతో ప్రారంభించిన టెక్నికల్ హబ్‌లో ప్రస్తుతం 40 శాతానికి పైగా విద్యార్థులు శిక్షణ పొందుతున్నట్టు తెలిపారు. రూ. 31.31 లక్షల అత్యుత్తమ వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించే విధంగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నట్టు చెప్పారు. టెక్నికల్ హబ్ సీఈఓ బాబ్జీ నీలం, కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఆదిరెడ్డి రమేష్, డోలా సంజయ్ సుబ్రహ్మణ్యం, కె.రవి శంకర్, డి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



కిర్లంపూడిలో బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు

కిర్లంపూడి: హెల్మెట్‌ధారణపై శుక్రవారం స్థానిక పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సై టి.రఘునాథరావు ఆధ్వర్యంలో కిర్లంపూడి ప్రధాన రహదారుల గుండా పోలీసులు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు హెల్మెట్‌లు ధరించి బైక్ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రఘునాథరావు మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు తలకు తీవ్ర గాయాలై ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపై ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధర కన్న ప్రాణం ఎంతో విలువైనదని, హెల్మెట్ లేని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ కొని సురక్షతమైన ప్రయాణం చేయాలని సూచించారు. ఏఎస్సైలు బిఎస్‌విన్ కుమార్, రామకృష్ణమూర్తి, కానిస్టేబుల్ శ్రీనివాసరావు, వైస్‌ఎంపీపీ బొడ్డేటి గణపతి పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి

తుని రూరల్: సురక్షిత ప్రయాణానికి ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.సన్యాసిరావు సూచించారు. తుని రూరల్ ఎస్సై ఎ.బాలాజీ ఆధ్వర్యంలో శుక్రవారం హెల్మెట్‌ధారణపై ద్విచక్ర వాహనదారులకు స్టేషన్ వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సన్యాసిరావు మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పటికీ ప్రాణాలు రక్షించుకోవచ్చన్నారు. అనంతరం జాతీయ రహదారిపై పోలీసులు, మహిళా పోలీసులు, నోబుల్ ఐటీ విద్యార్థులు మోటార్ సైకిళ్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వి.కొత్తూరు వైజంక్షన్‌లో హోర్డింగులు ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరం: హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం పట్టణంలో పోలీసులు మోటారు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్సై జిసతీష్ ఆధ్వర్యంలో పుర వీధుల్లో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు.

ఘనంగా కొండరాజులబాబు తీర్థం

ఏలేశ్వరం: మండలంలోని రమణయ్యపేటలో కొండరాజులబాబు తీర్థం మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో వివిధ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు

విశ్వేశ్వరస్వామికి రుద్రాభిషేకం



విశ్వేశ్వరస్వామికి రుద్రాభిషేకం చేస్తున్న అర్చకుడు

తొండంగి: ఒంటిమామిడిలో విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి రుద్రాభిషేకం, లక్షపత్రిపూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు శుంకరణం గోవిందరావుశర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పండిత సదస్యం జరిగింది. అనంతరం పండితులను ఘనంగా సత్కరించారు. మాఘపౌర్ణమి రోజున స్వామివారి తీర్థం కావడంతో ఒంటిమామిడి నుంచి శివాలయం వరకూ పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలికంగా వీధిలైట్లు ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ అంగుళూరి సుధాకర్ తెలిపారు.

60 మందికి కంటి పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుప్రియ

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం ఆదిత్య ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక షిర్డీ నగర్‌లోని ఆదిత్య ఆసుపత్రిలో డాక్టర్ సుప్రియ సుమారు 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 25 మందిని శస్త్రచికిత్స నిమిత్తం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో వైద్యులు శివదుర్గ ప్రసాద్, జయబాబు సిబ్బంది పాల్గొన్నారు.